సాక్షి
వికారాబాద్

శనివారం : 12 : ఆగస్టు : 2023



రోడ్డెక్కిన మహిళలు

ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులు తీసుకోకపోవడంపై మహిళలు ఆగ్రహించారు. 2లో▸



ఇక సిరుల పంటలే

త్వరలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. 2లో▸



పత్తాలేని పెసర

టమాట ధర వింటే నోటమాట రావడంలేదు. దానికి కారణం? దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమే కారణం. 3లో▸

ఎవరి ధీమా వారిదే!

తాండూరులో రసవత్తర రాజకీయం

- అన్ని పార్టీల్లోనూ టికెట్ల గోల
- అభివృద్ధే గెలిపిస్తుందంటున్న బీఆర్‌ఎస్
- తమ స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంటామంటున్న కాంగ్రెస్
- మార్పు తథ్యమంటున్న కాషాయ పార్టీ నేతలు



తాండూరు టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు గడ్డపై విజయ కేతనం ఎగురవేసేందుకు అన్ని పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఈసారి విజయం మాదంటే.. మాదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమంలో మేమే నంబర్ వన్‌గా ఉన్నామని.. ప్రజలు తమవైపే మొగ్గుచూపుతారని అధికార బీఆర్‌ఎస్ నేతలు చెబుతుండగా.. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా గెలుపు మాదేనని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ దారుణంగా విఫలమైందని, ఈ విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో హస్తం పార్టీ వెనకబడిందని చెబుతున్న బీజేపీ నేతలు.. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం తమకే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బరిలోకి దిగనున్న తమకు విజయావకాశాలు దండిగా ఉన్నాయని బీఎస్పీ నేతలు ప్రకటిస్తున్నారు.

పథకాలే గెలిపిస్తాయి..

సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని అధికార పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. తాండూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని తొంభైశాతానికి పైగా స్థానాల్లో తమ అభ్యర్థులే గెలుస్తారని బలంగా చెబుతున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై గెలిచినప్పటికీ తాండూరు అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్‌లో చేరానని.. అనుకున్నట్లుగానే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు తీయించానని ప్రస్తుత ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి చెబుతున్నారు. ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ తనకే వస్తుందని, మరోసారి గెలిచి తాండూరును రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెడుతానని పేర్కొంటున్నారు. ఇందుకోసం పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్ ఆశీస్సులు తనకు మెండుగా ఉన్నాయని చెబుతున్నారు.

బలమైన ఓటు బ్యాంక్..

గత ఎన్నికల్లో తాండూరులో కాంగ్రెస్ అభ్యర్థే గెలుపొందారని, ఈసారి కూడా విజయం తమవైపే ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నేత రమేష్ మహరాజ్ పేర్కొంటున్నారు. స్వప్రయోజనాల కోసం పార్టీ మారిన రోహిత్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని, మహేందర్‌రెడ్డిని తాండూరు ప్రజలు గత ఎన్నికల్లోనే తిరస్కరించారని చెబుతున్నారు. నియోజకవర్గ ప్రజలెవరూ వారిద్దరినీ నమ్మే పరిస్థితి లేదంటున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ఇక్కడ మరోసారి కాంగ్రెస్ విజయం తథ్యమని ధీమా వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లో చేరినా.. ఆయనతో వెళ్లింది కొద్ది మంది మాత్రమేనని, అసలు సిసలైన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలందరూ ఇప్పటికీ పార్టీలోనే ఉన్నారంటున్నారు. అన్నింటికి మించి తాండూరులో కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉందని, ఎవరెన్ని చెప్పినా వీరు మారే పరిస్థితి ఉండదని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారిని సైతం తిరిగి ఆహ్వానిస్తామని, పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని చెబుతున్నారు.

బహుజన నినాదంతో..

బహుజన నినాదంతో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. వర్గపోరును భరించలేని తాండూరు ఓటర్లు బహుజనుల కోసం పాటుపడే బీఎస్పీ వైపు మొగ్గు చూపుతారని చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు టికెట్ ఇస్తే..?

రాష్ట్రంలో మెజారిటీ జనాభా బీసీలే. ఈ నేపథ్యంలో ప్రతి పార్టీ జిల్లాకు రెండు చొప్పున అసెంబ్లీ స్థానాలను బీసీ అభ్యర్థులకు ఇవ్వాలని బీసీ సంఘాలు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి బీసీ లేదా జనరల్‌కు కేటాయించినా.. టికెట్ తనదేనని రమేశ్‌మహరాజ్ చెబుతున్నారు. అలాగే బీజేపీ నుంచి బీసీ అభ్యర్థులైన రవిశంకర్, రమేష్ కుమార్, మురళీకృష్ణ గౌడ్, నరేశ్‌మహరాజ్ బరిలోకి దిగేందుకు పావులు కదుపుతున్నారు. ఒకవేళ అధికార బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు టికెట్‌ను బీసీలకు కేటాయిస్తే తప్పకుండా తనకే టికెట్ వస్తుందని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కీలకం కానున్న మైనార్టీ ఓట్లు..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు మైనార్టీల నుంచి మంచి సపోర్టు ఉంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి ఎవరు బరిలో నిలిచినా మైనార్టీ ఓట్లు చీలడం మాత్రం ఖాయం. బీజేపీకి మైనార్టీలు ఓటువేసే పరిస్థితిలో లేరని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అయితే.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మైనార్టీ ఓట్లను చీల్చుకుంటే ఇరువురికి ఇబ్బందికరంగానే మారుతుందని.. ఈ క్రమంలో మిగిలిన వర్గాల ఓట్లను తమవైపు తిప్పుకొనేందుకు తాండూరు బరిలో బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని దింపవచ్చనే టాక్ కూడా జోరుగా వినిపిస్తోంది. ఏది ఏమైనా ఈసారి తాండూరులో రసవత్తర పోటీ ఖాయమనే చెప్పవచ్చు. ఏ పార్టీ ఎవరికి బీ- ఫారం ఇస్తుందో స్పష్టంగా తెలిస్తే తప్ప ఒక నిర్దిష్టమైన అవగాహనకు రాలేమని విశ్లేషకులు భావిస్తున్నారు.

వర్గపోరే ప్రధాన బలహీనత

గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. టికెట్ తనకే వస్తుందని బాహాటంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో గులాబీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి. ముప్పై ఏళ్లగా తాండూరు ప్రజలకు సేవ చేస్తున్నానని.. మంత్రిగా, ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి పనులు చేశానని, అన్నివర్గాల ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానని చెబుతున్నారు. ఏది ఏమైనా బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేది, తాండూరులో గెలిచేది నేనేనని చెబుతున్నారు. ఈ క్రమంలో రెండుగా చీలిపోయిన బీఆర్‌ఎస్ మద్దతుదారులు ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరికి ఎంత మంది సర్ది చెబుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.

కమలం వికసించేనా..?

తాండూరు నడిబొడ్డున కాషాయం జెండా రెపరెపలాడించాలని బీజేపీ నేతలు కూడా విశ్వప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎన్‌ఆర్‌ఐ పటేల్ రవిశంకర్‌కు ఇంటిపోరు తప్పలేదు. సొంత పార్టీ నేతల నుంచి ఈయనకు అంతగా మద్దతు లభించలేదు. ఎప్పటి నుంచో పార్టీని పట్టుకుని ఉన్న తనను కాదని ఎన్‌ఆర్‌ఐకి టికెట్ ఇవ్వడంపై అసంతృప్తికి గురైన స్థానిక బీజేపీ నేత రమేష్‌కుమార్ అప్పట్లో తన క్యాడర్‌తో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన పరిణామాలతో తిరిగి సొంతగూటికి వచ్చారు. గత ఎన్నికల్లో పైలెట్ రోహిత్ రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించిన మురళీకృష్ణ గౌడ్.. ఆయనతో విడిపోయి బీజేపీలో చేరారు. ప్రస్తుతం గ్రామాల్లో పర్యటిస్తూ పార్టీని బలోపేతం చేయడంలో నిమగ్నమయ్యారు. గతంలో టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయిన నరేష్ మహరాజ్ బీఆర్‌ఎస్‌లో చేరి.. ఆ తర్వాత బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్, ప్రస్తుత తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న లక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాషాయ కండువా కప్పుకొన్నారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇటీవల ఆయన ప్రెస్‌మీట్ పెట్టి మరీ బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా బరిలో దిగుతానని ప్రకటించారు. రమేశ్‌కుమార్, మురళీకృష్ణగౌడ్, నరేష్ మహరాజ్, లక్ష్మారెడ్డి.. ఇలా అందరూ తమను తాము ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకోవడంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలకు 325 దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో మద్యం టెండర్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ ఆవరణలోని జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో మద్యం దుకాణాలకై వేస్తున్న టెండర్ల ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు ఆగస్టు 18 వరకు టెండర్ల దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 325 దరఖాస్తులు రాగా.. వికారాబాద్ సర్కిల్‌లోని 15 షాపులకు 82 దరఖాస్తులు, పరిగి సర్కిల్‌లోని 12 షాపులకు 105 దరఖాస్తులు, తాండూరు సర్కిల్‌లోని 18 షాపులకు 58 దరఖాస్తులు, మోమిన్ పేట్‌లోని 6 షాపులకు 51 దరఖాస్తులు, కొడంగల్‌లోని 8 షాపులకు గాను 29 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 21న డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ రాఘవేణి, చంద్రశేఖర్, సైదులు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పొదుపు, రుణాలపై సమాచారం ఇవ్వండి

డీపీఎం రామ్మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

దౌల్తాబాద్: ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగే మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని డీపీఎం రామ్మూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గత రెండు సంవత్సరాలుగా ఏపీఎం సాయన్న చేసిన పలు కార్యక్రమాలను వివరించారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ.. ప్రతి సంఘంలో మహిళలు చేస్తున్న పొదుపు, రుణాల చెల్లింపులు, రికవరీలు, ఆర్థిక అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. జెడ్పీటీసీ మహిపాల్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అలాగే ఐకేపీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్న కార్యాలయ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ మంజుల, ఏపీఎం సాయన్న, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

మైనార్టీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత

ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

అనంతగిరి: మైనారిటీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని క్లబ్ ఫంక్షహాల్‌లో శుక్రవారం ముస్లిం మైనార్టీ నాయకుతలో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో ముస్లిం మైనార్టీలకు శ్మశానవాటిక, ఫంక్షన్‌హాల్ ఏర్పాటుకు 3 ఎకరాల నాలుగు గుంటల స్థలాన్ని కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను నాయకులకు అందజేశారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ హఫీజ్, షకీల్, రఫీ, బషీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ అభ్యర్థుల జాబితా

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీకోసం నిర్వహించిన పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తి ప్రకారం మెరిట్ కమ్ రోస్టర్ ఆధారంగా అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 11న పరిశీలిచామని.. తదుపరి 1:1 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను డీఈఓ కార్యాలయం వద్ద అతికించడంతో పాటు జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్‌లో కూడా ఉంచినట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే శనివారం మధ్యాహ్నం 2గంటల్లోపు విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. 12న సాయంత్రం తుదిజాబితా విడుదల చేస్తామని.. 13న ఎంపికైన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు అదేరోజు విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో చేరండి: డీఐఓ



విద్యార్థినికి అడ్మిషన్ ఫాం ఇస్తున్న డీఐఓ శంకర్

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులను చేర్పించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా డీఐఓ శంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కళాశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కళాశాలలో ఇప్పటి వరకు 14 అడ్మిషన్లు మాత్రమే వచ్చాయని ఇంకా సంఖ్య పెరిగేలా కృషి చేయాలన్నారు. మారుమూల ప్రాంతమైన మండలానికి కళాశాల మంజూరు కావడం అభినందనీయమన్నారు. త్వరలో లెక్చరర్ల పోస్టులు కూడా మంజూరు చేయిస్తామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయినాథ్, సర్పంచ్ శిరీష, రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు, రిటైర్డ్ ఎంఈఓ బాబుసింగ్ ఉన్నారు.

నేడు జానపద కళాకారుల సమావేశం

బొంరాస్‌పేట: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం (టీజేకేఆర్‌ఎస్) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని శనివారం హిమాయత్ సాగర్‌లోని అక్షయ హోటల్‌లో నిర్వహించనున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రతినిధులతో కలిసి నిర్వహించే సమావేశంలో జానపద కళాకారుల ఉపాధి, సభలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీ.రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తదిరతులు హాజరవుతారని తెలిపారు. జానపద కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణలో అరాచక పాలన

ఏఐసీసీ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే విష్ణునాథ్



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణునాథ్

పరిగి: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని ఏఐసీసీ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే పీసీ విష్ణునాథ్ విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విష్ణునాథ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రతి పనికి కమీషన్లు తీసుకుంటూ తమ స్వలాభం కోసమే పనిచేస్తోందన్నారు. బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామ నిధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు,సురేందర్,కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డితో సస్యశ్యామలం

- ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడం శుభపరిణామం
- కాళేశ్వరం కంటే వేగంగా పాలమూరు పూర్తిచేస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి సబితారెడ్డి



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించడం శుభపరిణామం అని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తితో జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జిల్లెలగూడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఒక్కో రంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. రాష్ట్రాన్ని సమూలంగా అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరాన్ని మూడేళ్లలోనే పూర్తి చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. అదే స్ఫూర్తితో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సైతం పూర్తి చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు కట్టడం ఎంత ముఖ్యమో.. వాటికి అనుమతులు సాధించడం కూడా అంతే ముఖ్యమన్నారు. సీఎం ప్రత్యేక చొరవతోనే ఈ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించాయని, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలు ఈ విషయంలో ఆయనకు ఎంతో రుణపడి ఉంటారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. తమ ప్రభుత్వంపై ఇక్కడి బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వారికి చేతనైతే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా తేవాలన్నారు. త్వరలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మరో కోనసీమగా మారబోతోందని చెప్పారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

- జిల్లాలో 57,571 అర్జీలు
- మొదటి స్థానంలో దౌల్తాబాద్, లాస్ట్‌లో నవాబుపేట్

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకానికి జిల్లాలో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. సొంత స్థలం ఉన్న నిరుపేదలు ఇల్లు కట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మంగళ, బుధ, గురువారాల్లో (మూడు రోజులు) ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాలతో పాటు, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులను గురువారం సాయంత్రం వరకు స్వీకరించారు. దరఖాస్తులకు కేవలం మూడురోజులే సమయం ఇచ్చినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. జిల్లాలోని 20 మండలాల్లో అత్యధికంగా దౌల్తాబాద్ మండలం నుంచి 7,553 దరఖాస్తులు వచ్చాయి. తక్కువగా నవాబుపేట్ మండలంలో 1178 దరఖాస్తులు వచ్చాయి.

మండలాల వారీగా..

జిల్లాలోని మండలాల వారీగా దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తే పరిగి నియోజకవర్గంలో.. దోమ మండలంలో-3218, కుల్కచర్ల-5363, పరిగి-2437, పరిగి మున్సిపల్-531, పూడూర్-2393 వచ్చాయి. తాండూరు నియోజకవర్గంలో.. బషీరాబాద్-2250, పెద్దేముల్-3583, తాండూరు మున్సిపల్-1192, తాండూరు-3131, యాలాల్-3129 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ నియోజకవర్గంలో.. బంట్వారం-1392, ధారూర్-3006, కోట్‌పల్లి-1258, మర్పల్లి-3057, మోమిన్‌పేట్-1739, వికారాబాద్ మున్సిపల్-2188, వికారాబాద్-1978 దరఖాస్తులు వచ్చాయి. కొడంగల్ నియోజకవర్గంలో.. బొంరాస్‌పేట్-2696, దౌల్తాబాద్-7553, కొడంగల్ మున్సిపల్-511, కొడంగల్-3788 దరఖాస్తులు వచ్చాయి. చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండలంలో-1178 దరఖాస్తులు వచ్చాయి.

సోమవారం నుంచి క్షేత్రస్థాయి పరిశీలన..

గృహలక్ష్మీ పథకం కింద వచ్చిన దరఖాస్తులకు సంబంధించి లబ్ధిదారులను సోమవారం నుంచి అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. మండలాల వారిగా టీంలను ఏర్పాటు చేసి స్రూట్నీ చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. కాగా లబ్ధిదారులకు మూడు విడతల్లో ఆర్థికసహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



తాండూరు రూరల్: బీఆర్‌ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: నేను మీ బిడ్డను.. తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం ఇందర్‌చెడ్ గ్రామానికి చెందిన వ్యక్తిని.. నన్ను ఆశీర్వదించాలని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు రావులపల్లి చంద్రశేఖర్‌గౌడ్ (ఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం 250 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాందాస్, నాయకులు ఉమాశంకర్, నరేందర్‌రెడ్డి, హసన్ పటేల్, రఘుగౌడ్, రాములు, విజయ్ ఉన్నారు.

తండాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

పెద్దేముల్: మారుమూల పల్లెలతో పాటు గిరిజన తండాలను నూతన పంచాతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల ధారుని వాగు తండాకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మొగానాత్ పవర్.. ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పెద్దేముల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టండి..

తాండూరు టౌన్: రెండోవిడత గొర్రెల పంపిణీని త్వరగా ప్రారంభించాలని శ్రీ మల్లికార్జున ప్రాథమిక గొర్లకాపరుల సహకార సంఘం సభ్యులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి శుక్రవారం వినతిప్రతం అంజేశారు. జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గొర్రెల కోసం ఒక్కొక్కరి వాటా కింద మూడునెలల క్రితం అప్పుచేసి రూ.43,750 డీడీల రూపంలో చెల్లించామన్నారు.వెంటనే పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం డివిజన్ అధ్యక్షుడు వెంకటయ్య, కురుమసంఘం డివిజన్ అధ్యక్షుడు జగదీష, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కౌన్సిలర్ బాలప్ప, పూజారి పాండు, నర్సింహులు,బాలు,అంజయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామివారి సేవలో శుభప్రద్‌పటేల్‌


శుభప్రద్‌పటేల్‌కు హనుమాన్‌ చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాండూరు టౌన్‌: పట్టణంలోని రాజీవ్‌కాలనీ నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామిని రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యుడు శుభప్రద్‌ పటేల్‌ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి చేయూతనిచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకన్నగౌడ్‌, సాయప్ప, చిన్న గౌడ్‌, శుభప్రద్‌ పటేల్‌ ట్రస్టు సభ్యులు భాను, బాలు, దత్తాత్రేయ, సచిన్‌, రాము, నరేష్‌, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: మండలంలోని అన్నారం గ్రామంలో వార్డు సభ్యుడు రాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ అనిత, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్‌ మధుసూదన్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆవు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోండి


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

తాండూరు రూరల్‌: అజాగ్రత్తగా వ్యవహరించి ఆవు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళా రైతు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వీరశెట్టిపల్లి గ్రామ శివారులో ఝాన్సీలక్ష్మి అనే మహిళా రైతు ఓ ఫాంహౌస్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తోంది. ఆ ఫామ్‌హౌస్‌లో 13 ఆవులు ఉన్నాయి. ఈ ఆవుల నీడ కోసం రేకుల షెడ్డు వేసేందుకు తాండూరుకు చెందిన సల్మాన్‌, ఫర్హాజ్‌, సమీర్‌ వచ్చారు. వెల్డింగ్‌ పనులు చేసే క్రమంలో అజాగ్రత్తగా వ్యవహరించడంతో కరెంట్‌ షాక్‌కు గురై ఓ ఆవు మృతి చెందింది. దీంతో మహిళా రైతు ఆ వ్యక్తులపై కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతి చెందిన ఆవును ఫామ్‌ హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

‘గృహలక్ష్మి’కి రోడ్డెక్కిన మహిళలు

- దరఖాస్తులు తీసుకోకపోవడంపై ఎంపీడీఓను నిలదీత
- పోలీసుల రంగ ప్రవేశం
- కార్యాలయంలో గందరగోళం
- తాండూరు – దేవనూరు రోడ్డుపై ధర్నా


ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగిన మహిళలు


తాండూరు - దేవనూరు రోడ్డుపై ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు

యాలాల: ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులు తీసుకోకపోవడంపై మహిళలు ఆగ్రహించారు. అధికారుల తీరుకు నిరసనగా పట్టణంలోని తాండూరు – దేవనూరు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గృహలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకునేందుకు మండలం నుంచి జనం ఎంపీడీఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. మూడు రోజుల నుంచి అన్ని గ్రామాల ప్రజలు భారీగా తరలిస్తున్నారు. శుక్రవారం పలు గ్రామాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. అయితే గురువారంతో గడువు ముగిసిందని దరఖాస్తులు తీసుకోవడం లేదని అధికారులు చెప్పడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ పుష్పలీలను అడిగారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని, దీంతో దరఖాస్తులు తీసుకోవడం లేదని చెప్పారు. ఆగ్రహించిన కొందరు ఇటీవల మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్న మాటలను, పత్రికల్లో వచ్చిన వార్తలను ఎంపీడీఓకు చూపించారు. ఒకవైపు మంత్రి దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, తెల్ల కాగితంపై దరఖాస్తు చేసినా అర్హులకు ఆర్థిక సహాయం అందజేస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే దరఖాస్తులు తీసుకుంటామని ఎంపీడీవో స్పష్టం చేశారు. దీంతో మహిళలు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి మహిళలను కార్యాలయం బయటికి పంపించారు. ఆగ్రహించిన మహిళలు తాండూరు – దేవనూరు రోడ్డుపై ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కేవీపీఎస్‌, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మలయ్య, బుగ్గప్ప అక్కడికి చేరుకొని మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. గృహలక్ష్మి ఆర్థిక సహాయం వచ్చేలా చూడాలని రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

పీఆర్సీ కమిటీ వేయాలి

అనంతగిరి: 2023 జూలై నుంచి పీఆర్సీ కమిటీని వేయాలని టీఎన్జీవో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌ కోరారు. శుక్రవారం వికారాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్సీ తోపాటు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు హెల్త్‌ కార్డులు మంజూరు చేయాలని, టీఎన్జీవో హౌసింగ్‌ సొసైటీని ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌, కార్యదర్శి జిల్లా అజ్మత్‌ పాషా, నాయకులు నర్సింలు, రమేష్‌, మహేష్‌ పాల్గొన్నారు.


సమావేశం మాట్లాడుతున్న నాయకులు

ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్‌ చేయబోయి..


ప్రమాద స్థలంలో ఓంకార్‌ మృతదేహం


ఓంకార్‌(ఫైల్‌)


రాజు(ఫైల్‌)

- లూనాను ఢీకొని.. ట్రాక్టర్‌ ట్రాలీ కింద పడి ఇద్దరి దుర్మరణం
- మోమిన్‌పేటలో ఘటన
- మృతులు సంగారెడ్డి జిల్లా వాసులు

మోమిన్‌పేట: ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్‌ చేయబోయి లూనాను ఢీకొని ట్రాక్టర్‌ ట్రాలీ కింద పడి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన ఘటన మోమిన్‌పేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌ రెడ్డి కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కోహీర్‌ మండలం గొట్టిగార్‌పల్లికి చెందిన రాజు(35), అతని స్నేహితుడు ఓంకార్‌(32) బైక్‌పై వికారాబాద్‌కు వెళ్లారు. గ్రామానికి తిరిగి వస్తుండగా మోమిన్‌పేట బీకేఆర్‌ గార్డెన్‌ వద్ద ఇసుక ట్రాక్టర్‌ను ఓవర్‌ టేక్‌ చేయబోయి ఎదురుగా వస్తున్న లూనాను ఢీ కొట్టారు. దీంతో ఇద్దరూ ట్రాక్టర్‌ ట్రాలీ కింద పడ్డారు. ఓంకార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాజును అలాగే లూనా నడుపుతున్న మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన సలీంను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు మృతి చెందాడు. స్నేహితులిద్దరూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని సీఐ ఆంజనేయులు సందర్శించారు.

ప్రత్యేక నిధులతో పంచాయతీల అభివృద్ధి

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- మేడికొండలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన


మేడికొండలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: పంచాయతీల అభివృద్ధికి కేసీఆర్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడికొండ గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పంచాయతీ చట్టం తెచ్చి ప్రత్యేక నిధులు కేటాయించి జీపీలను పటిష్టం చేశారని పేర్కొన్నారు. పాలనా సౌలభ్యం కోసం అనుబంధ గ్రామాలకు జీపీ హోదా కల్పించినట్లు తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉన్న అడ్డంకులను ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడంతో బీఆర్‌ఎస్‌ శ్రేణులు మన్నెగూడ చౌరస్తాలో టపాసులు పేల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ అజారుద్దీన్‌, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రఫీస్‌ఖాన్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ నర్సింహ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

పరిగి: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్‌ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సొండేపూర్‌, రంగంపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాల ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తోందని తెలిపారు. పట్టణాల తరహాలో గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయంటే అది సీఎం కేసీఆర్‌ కృషే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌ కుమార్‌, సొండేపూర్‌ సర్పంచ్‌ అపర్ణ, వైస్‌ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌, రైతు బంధు మండల కోఆర్డినేటర్‌ రాజేందర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ భోజ్యానాయక్‌ పాల్గొన్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరు..

పరిగి: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగు నీరు అందనుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతి రావడంతో శుక్రవారం పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్‌ నేతలు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకు 70నుంచి 80శాతం పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలో మిగితా పనులు పూర్తిచేస్తామన్నారు. మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌కుమార్‌, ఎంపీపీ అర వింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, దోమ వైస్‌ ఎంపీపీ మల్లేశం, సీనియర్‌ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్‌, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను పర్మినెంట్‌ చేయాలి

- లేకుంటే 15నుంచి నిరవధిక సమ్మె
- ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డికి వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

తాండూరు టౌన్‌: కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌, ఏఎన్‌ఎంలను పర్మినెంట్‌ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పైలట్‌ రోహిత్‌రెడ్డిని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏఎన్‌ఎంలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెడికల్‌ అండ్‌ హెల్త్‌ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను పర్మినెంట్‌ చేయాలన్నారు. వారికి పెన్షన్‌ సౌకర్యం, ఇళ్ల స్థలాలు, 180 రోజుల మెడికల్‌ సెలవులు, పదకొండో పీఆర్సీ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం కాంట్రాక్ట్‌ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్‌ ఉద్యోగులుగా పరిగణిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. వెంటనే ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రోజా, వెంకటమ్మ, భారతి, సుమలత, మల్లమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో రైతుకు గాయాలు


చికిత్స పొందుతున్న కృష్ణయ్య

ధారూరు: పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మరమ్మతులు చేస్తూ ఓ రైతు విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. ఈ సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజాపూర్‌కు చెందిన కృష్ణయ్య(38) పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మరమ్మతులు చేయడానికి వెళ్లాడు. నాగారం సబ్‌స్టేషన్‌కు ఫోన్‌ చేసి ఎల్‌సీ తీసుకున్నాడు. పనులు పూర్తయ్యాక ఎల్‌సీ రిటన్‌ ఇచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ ఆన్‌ చేసినా సమస్య అలాగే ఉండడంతో ఎల్‌సీ అడగకుండానే మళ్లీ మరమ్మతులు చేయడానికి యత్నించడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతోంది

- ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: పలు హత్య కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సిబ్బంది కృషి చేయడంతో పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతోందని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల ఛేదన, సాక్ష్యాలు సేకరించడంలో పోలీసులు ఎంతగానో శ్రమిస్తున్నారని, ఈ కారణంగానే నిందితులకు శిక్ష పడుతోందని తెలిపారు. దీంతో ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెరిగిందన్నారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్‌ డీ ఎస్పీ వీరేష్‌, జిల్లా వర్టికల్‌ మానిటరింగ్‌ డీఎస్పీ జానయ్య, ఏవో జ్యోతిర్మని, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశం, కంట్రోల్‌ రూమ్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రమీల, ఆర్‌ఐ సూరప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

అనంతగిరి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి హరీశ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఏబీవీపీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదన్నారు. అరకొర వసతులతో భవనాల్లో కళాశాలలో వసతి గృహాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలికంగా మౌలిక వసతులను వెంటనే కల్పించాలన్నారు. కళాశాలలో ఖాళీ ఉన్న లెక్చరర్‌ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కళాశాల భవనం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు సందీప్‌, ప్రవీణ్‌, శ్రీకాంత్‌, నవీన్‌, అరుణ్‌, గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి విగతజీవిగా..

- ముంబైలో అడవి వెంకటాపూర్‌ వాసి నేనావత్‌ విఠల్‌నాయక్‌ మృతి
- పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం


విఠల్‌ నాయక్‌(ఫైల్‌)

కుల్కచర్ల: బతుకు పోరాటంలో మరో వలస కూలి చనిపోయాడు. ఉన్న ఊరిని వదిలి వలస వెళ్లి విగతజీవిగా స్వగ్రామానికి చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చౌడాపూర్‌ మండలం అడవి వెంకటాపూర్‌కు చెందిన నేనావత్‌ విఠల్‌ నాయక్‌(34) మహారాష్ట్రలోని కంజూర్గ్‌ మార్గ్‌ ప్రాంతంలో మేస్త్రీగా పని చేసేందుకు వెళ్లాడు. పదేళ్ల నుంచి అక్కడే ఉంటూ గ్రామంలో కుటుంబాన్ని పోషించేవాడు. తండ్రి లేకపోవడంతో తానే ఇంటి పెద్దలా మారాడు. మంగళవారం అనారోగ్యంతో అక్కడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. బుధవారం గుండె సంబంధిత సమస్యతో మృతి చెందాడు. నేనావత్‌ విఠల్‌ నాయక్‌ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి ఆసరాగా ఉన్న విఠల్‌ నాయక్‌ మృతి మృతితో తల్లి సీతాబాయి, భార్య విజయ, కుమారులు సునిల్‌(12), అనిల్‌(8) బోరున విలపించారు.

రైతన్న ఇంట ఇక సిరుల పంటలే

- త్వరలో 'పాలమూరు – రంగారెడ్డి'ని పూర్తి చేస్తాం
- పర్యావరణ అనుమతులకు లైన్‌ క్లియర్‌
- నియోజకవర్గంలో 1.49 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్‌: త్వరలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే రైతన్న ఇంట సిరుల పంటలు పండుతాయన్నారు. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వచ్చాయని తెలిపారు. కొడంగల్‌ నియోజకవర్గంలో 1.49 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కాంగ్రెస్‌ నేతలు కోర్టుల్లో కేసులు వేయడం వల్లే ఇన్నాళ్లు పనులు జరగలేదన్నారు. దామరగిద్ద మండలం కానుకుర్తిలో రిజర్వాయర్‌ నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. కాలువల పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పారు. అర్హులకు గృహలక్ష్మి పథకం అమలయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. మొదటి విడతలో మూడు వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్‌లో బీసీ బాలుర గురుకుల పాఠశాలలను, కొడంగల్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని అన్నారు. వర్షాలు కురిసి అన్ని చెరువులు కుంటలు నిండాయన్నారు. వరి ధాన్యానికి కొదవ ఉండదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌ ప్రజారంజక పాలన చేస్తున్నారని కొనియాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత కరెంట్‌, రైతు బీమా, రైతు బంధు, ఆసరా పింఛన్లు, కేసీఆర్‌ కిట్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ లాంటి పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసినట్లు చెప్పారు. కుల వృత్తుల వారికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్‌ మధుసూదన్‌రావ్‌ యాదవ్‌, దానప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, భీములు, రమేష్‌బాబు, గోవింద్‌, అంజద్‌, వెంకటయ్య గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- యునైటెడ్‌ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ డిమాండ్‌
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

కొడంగల్‌ రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ నంబర్‌ 02/2023ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్‌ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ సభ్యులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20ఏళ్లుగా కాంట్రాక్ట్‌ పద్ధతిలో 2వ ఏఎన్‌ఎం, ఈసీ ఏఎన్‌ఎం, అర్బన్‌ హెల్త్‌ సెంటర్ల ఏఎన్‌ఎం, హెచ్‌ఆర్‌డీ ఏఎన్‌ఎంల పేరిట విధులు నిర్వహిస్తున్న దాదాపు 5వేల మందికి నూతన నోటిఫికేషన్‌తో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్‌ పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఎ(ఫిమేల్‌)ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. 11వ పీఆర్‌సీ ప్రకారం కనీస వేతనం(బేసిక్‌) రూ. 31,040 తోపాటు డీఏ, హెచ్‌ఆర్‌సీ, ఇతర అలవెన్స్‌లు ఇవ్వాలని, పెండింగ్‌ బకాయిలు చెల్లించాలని కోరారు. వ్యాక్సిన్‌ అలవెన్స్‌ రూ. 5 వందలు, యూనిఫాం అలవెన్స్‌ రూ. 2,500, 180రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్‌ లీవులు ఇవ్వాలన్నారు. నైట్‌ డ్యూటీలు, ఓపీ డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. బదిలీకి అవకాశం కల్పించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.